సమాజ పురోగమనము యువతరము పై అనగా యువకులైన స్త్రీ, పురుషులకు ఆధారపడి ఉంటుంది. దేశ పురోభివృద్ధిని ద్విచక్రవాహనంతో పోలిస్తే స్త్రీ, పురుషులు బండికి రెండు చక్రాల వంటి వారు. ఇద్దరూ ముందుకు సాగితే కాని అభివృద్ధి సాధ్యపడదు. మన దేశము కొంత అభివృద్ధి చెందినప్పటికీ ఇంకా మూఢ నమ్మకాలు మన సమాజాన్ని వదలలేదు. నిజానికి స్త్రీ తాను పుట్టినప్పటి నుండి ఎన్నో సమస్యలు ఎదుర్కొన వలసి వస్తుంది. ఆడపిల్ల పుట్టగానే అదేదో పూర్తిగా తన తప్పయినట్లు చూసే సాటి స్త్రీ ఆలోచనా పథానికి ఎంతో బాధ పడుతున్నది. న్యూనతా భావంతో కుంచించుకు పోతుంది. తనకంటూ కొన్ని ప్రత్యేకమైన, అభ్యుదయ ఆశయాలతో ఒక విశిష్టమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్న ఈనాటి స్త్రీకి ఎవరు విలువ నిస్తున్నారు? నిజానికి ఇది సమాజం లోని లోపం.

నవ మాసాలు మోసినా కన్నతల్లే తన సంతానంపట్ల వివక్షతతో వ్యవహరిస్తుంది. పెరుగుతున్న కొలదీ, వయసుతో బాటు లోకజ్ఞానాన్ని కూడా సంతరించుకొని ఆమె తన బ్రతుకు బాటకు పునాది ఏర్పరచుకుందామన్న ధ్యేయంతో ఉన్నా తన కిష్టమైన చదువుకు, అభిప్రాయాన్ని, మార్గాన్ని ప్రోత్సాహించరు. దీనితో తన ఆశలను, ఆశయాలను పాదులోనే సమాధి కట్టి వారు చెప్పిన మాటకు తల ఒగ్గుతున్నది. ఇది ఎనుబది శాతం సగటున భారతదేశంలో జరుగుతున్నది. ఇటువంటి భారతావనిలో స్త్రీకి నిజంగా స్వేచ్ఛ ఉన్నదా?

చివరకు తాను ధరించే దుస్తుల విషయంలో కూడా ఆమెకు స్వాతంత్ర్యం లేదు. తనకు ఇష్టమైన, వీలయిన దుస్తులు ఆమె ధరించకూడదు. సాంప్రదాయికమైన బట్టలనే తనకు ఎంతో

అసౌకర్యముగా ఉన్నా వాటిని ఆమె ధరించాలి. ఇటువంటి స్త్రీ నిజంగా స్వేచ్ఛతో ఉందంటే అది అసత్యం. ఆమె యొక్క శక్తియుక్తులు, ప్రజ్ఞా పాటవములు వంటిఇంటికి మాత్రమే అంకితం కావలసివస్తుంది. నిజానికి ఆమె శారీరక బలములో మినహా పురుషుడికి ఏ మాత్రం తీసిపోదు. కాని ఈ పురుషాధిక్యతా సమాజంలో ఆమెకు సహాయం చేసే వాళ్ళేలేరు. స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు తన సాటి స్త్రీ ఉన్నతిని మరొక స్త్రీ సహించలేక ఆమె పతనానికి కారణం అవుతుంది.

ఉద్యోగ విషయంలో కూడా ఆమె పరిస్థితి ఏ మాత్రం మెరుగ్గా లేదు. ప్రతివ్యక్తి తన సొంతకాళ్ళ మీద నిలబడటం ఎంత అవసరమో, అలాగే స్త్రీలు భావిస్తే అది చాలా తప్పు. వారు పురుషులతో సమంగా ఉద్యోగాలు చేస్తే తమ పరువుకు ఏమి నష్టము వాటిల్లుతుందో అని ప్రతి తండ్రీ, భర్త భావిస్తాడే కాని ఆమె ఆశయాలను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నాడని అనుకోడు. ఒకవేళ ఆమె ఉద్యోగం చేస్తున్నా సాటి ఉద్యోగులే ఆమెను చులకనగా చూస్తారు. ఉద్యోగం చేసే ఆడవారి పట్ల, సమాజంలో ఉద్యోగరీత్యా తిరిగే వారిపట్ల వారికి సదభిప్రాయం ఉండదు.

విద్య విషయంలో కూడ స్త్రీ తన పూర్తి స్వేచ్ఛను పొందలేక పోతోంది. మొగుడికి ఉత్తరం వ్రాసే చదువుచాలన్న సామెత ప్రకారం ప్రవర్తించే సగటు ఆడవాళ్ళ ప్రవర్తన మనకు తెలిసిందే. ప్రస్తుత పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా పూర్తి స్వేచ్ఛ పొందలేదని నగ్నసత్యం.

పొరపాటున ఏ స్త్రీ అయినా అత్యాచారానికి గురి అయితే ఆమెది అందులో తప్పులేదని తెలిసినా ఆమెను సూటి, పోటీ మాటలతో బాధిస్తారు. సానుభూతితో అర్థం చేసుకోకపోగా ఒకవేళ ఆమెకు వివాహం అయి ఉంటే కొందరు భర్తలు విడాకులు ఇవ్వడానికి కూడ సిద్ధపడతారు. విడాకులు తీసుకొన్న యువతి యొక్క బాధలు వర్ణనాతీతం. ఇటువంటి పరిస్థితులలో వేరొక వ్యక్తిని వివాహం చేసుకోవటం లోకానికి, క్రొత్తజీవితాన్ని ప్రారంభించటంలో స్త్రీకి ఎంతవరకూ స్వేచ్ఛ ఉంది? ఎంతమాత్రం లేదు.

జీవితంలో అతి ముఖ్యమైన తన వివాహ విషయంలో కూడా స్త్రీ స్వతంత్రించి ఏమి నిర్ణయాలు తీసుకోవడానికి అర్హురాలు కాదు. ఆమె చదువుకున్నా, లోకజ్ఞానం ఉన్నా తన జీవిత భాగస్వామి మీద ఆమెకు కొన్ని నిర్దుష్ట అభిప్రాయాలు ఉన్నా ఆమె అభిప్రాయాలకు ఏ మాత్రం విలువనివ్వరు. ఆమె స్వతంత్రించి ఏ వ్యక్తినైనా ప్రేమించినా సమాజం ఆమెదే తప్పుగా భావిస్తుంది. ఆమె ధైర్యం చేసి ప్రేమ వివాహం చేసుకుంటే పెద్దలు ఆమెతో తెగతెంపులు చేసుకోవటానికైన సిద్ధపడ్తారే కాని, ఆమె నిర్ణయం సమంజసం అని ఒప్పుకోరు. ఈ వివాహం కులాంతర, మతాంతర, వర్ణాంతరం అయితే వారికి సమాజమే ఎదురుగా నిలిచి వెలివేస్తుంది. నిజానికి పెద్దలు కుదిర్చిన వివాహాలు అన్నీ సఫలం కావు. కాలేవు. కాని ఆమె స్వతంత్రించి తన అభిప్రాయాలతో ఏకీభవించే వ్యక్తిని ఎంచుకొంటే అది వారి దృష్టిలో తప్పు. ఇంక ఎక్కడ ఉంది స్త్రీకి స్వేచ్ఛ చెప్పండి!

సృష్టికి మూలం స్త్రీయే. అట్లే సృష్టి యొక్క వినాశనానికి మూలకారణం స్త్రీనే. అవుతుంది. ఇది పురాణాలలో సైతం తిలకించవచ్చు. మహాభారతం స్త్రీకారణంగా చిత్రవిచిత్ర మలుపులు తిరిగింది. ద్వాపర, త్రేతాయుగంలో స్త్రీలు కూడ పురుషులతో సమానంగా అన్ని స్వేచ్ఛలను అనుభవించేవారు. రాజులు తమ కుమారులకు, కుమార్తెలకు సమానముగా అస్త్ర, శస్త్ర విద్యలను నేర్పించెడివారు. ఇందుకు పురాణగాథలలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. నరకునితో యుద్ధము

చేసే సమయంలో శ్రీకృష్ణుడు మూర్ఛపోయినప్పుడు సత్యభామ విల్లందుకోని సంహరించినది. కనుక స్త్రీలు అన్ని విద్యలు అభ్యసించెడి వారని మనకు పురాణము వలన తెలుస్తున్నది. ఈ విధంగా ఉన్న స్త్రీల పరిస్థితి క్షీణించిపోసాగింది.

మనదేశము పర మతస్థుల చేతికి చిక్కినప్పటి నుండి స్త్రీల పరిస్థితి దుర్భరము కాసాగింది. ముస్లిం రాజులు మనదేశంలో వారు పరిపాలించు సమయంలో అందమైన హిందూకన్యలను చేపట్టేవారు. అందులకు భయపడి ఆడపిల్ల తల్లితండ్రులు చిన్న వయస్సులోనే పిల్లలకు పెళ్ళి చేసేవారు. అది ఆచారంగా మారి బాల్యవివాహములు పేరుతో ఎందరో బాలికల జీవితములను నాశనం చేసినది.

కాలం మారిన కొలది ఆడపిల్లల తల్లిదండ్రులకు ధనాపేక్ష ఎక్కువై కన్యాశుల్కము అనే మరొక సాంఘిక దురాచారము ఏర్పడినది. ఆడపిల్ల తల్లిదండ్రులు తమకు కావలసిన ధనము తీసికొని ఆరు సం. బాలికను అరవై సం. వృద్ధున కిచ్చి వివాహం చేసేవారు. బాలిక యుక్తవయస్సు వచ్చేసరికి ఆ వృద్ధుడు మరణించేవాడు. అప్పటి నుండి ఆ అమ్మాయి విధవగా ఉండి బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా దుర్భర జీవితం గడపవలసి వచ్చేది. విధవగా ఆ బాధలను భరింపలేక కొందరు కన్నెపిల్లలు తమ భర్తశవముతో పాటు చితిలో పడి మరణించేవారు. ఇది చూచిన కొందరు పెద్దలకు ఈ పద్ధతి ఉచితంగా తోచింది. దీని ఫలితంగా సతీసహగమనం అను మరొక దురాచారం వచ్చింది. కొందరు స్త్రీలకు ఈ విధంగా మరణించటం ఇష్టం లేకపోయినప్పటికీ వారు తప్పక సహగమనం చేయవలసి వచ్చేది. ఊహించుకొంటేనే భయానకంగా ఉన్న ఈ స్త్రీల పరిస్థితి చూస్తే నిజంగా స్వేచ్ఛ ఉందని ఎవరైనా అంటారా?

ఆ తరువాత ప్రస్తుత దురాచారము వరకట్నం అమలులోకి వచ్చింది. దీని ప్రకారము మొదట్లో ఆడపిల్ల తల్లిదండ్రులు తమ శక్తికొలది, వారికి కలిగినంత పైకమును వరునకు కట్నంగా ఇచ్చేవారు. ఈ పద్ధతి ఎంతోమంది సదాశయంతో ప్రారంభించారు. తమ కుమార్తె సంసారమును సుఖమయము చేయవలెనని, నూతన గృహమునకు కావలసిన వస్తువులు కొనుక్కొనుటకు ఈ కట్నం ఇచ్చేవారు. కాని ఈ ఆచారం నేడు దురాచారం అయి సమాజంలో ప్రబలిపోతుంది. నేటి సమాజంలో ఆడపిల్ల తరుపువారు తమకు శక్తికి మించి కట్నమును ఈయవలసి వస్తుంది. నేడు సమాజంలో వరకట్నపు చావులు సామాన్యమై పోయాయి. ఈ వరకట్న దురాచారానికి విరుద్ధంగా శాసనం ప్రవేశపెట్టినప్పటికీ అది అమలులోకి రావటం లేదు. ఇటువంటి పరిస్థితులలో స్త్రీలకు నిజంగా స్వేచ్ఛ ఉందా?

ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీహస్తం ఉందని అంటారు. కాని, ఎవరూ స్త్రీవిజయం వెనుక ఎవరనేది చెప్పరు. స్త్రీ విజయం వెనుక ఆ స్త్రీ యొక్క ఆత్మస్థైర్యం ఉంటుంది. దీన్ని బట్టి స్త్రీఎంత శక్తి స్వరూపిణో తెలుస్తుంది. ఎక్కడైతే స్త్రీకి అనాదరణ లభిస్తుందో అక్కడే వినాశనం మొదలు అవుతుంది. కనుక మన పురుషాధిక్య సమాజంలో యువతరం అంతా స్త్రీకి పురుషులతో సమానంగా అన్నింటిలో స్వేచ్ఛ కల్పించినట్లయితే అది స్త్రీ ఉన్నతాభివృద్ధికి సహాయపడుతుంది.

జి. శివశంకర్
ఎన్ జడ్ ఎఫ్ - 35

## పిచ్చిమనసు

అమెను చూశాయి కనులు
మెల్లగా గిల్లాయి మనసుని
పిడికిలంత లేదు కడలిలా ఎగిసెగిసి పడింది మనసు.
ఊహల పార్శ్వంలో.........
వేయి ఆశల దీపాలు వెలిగించింది ఒక్కసారిగా
కోటి కోర్కెల వీణలు మీటింది అదే పనిగా
వలపు పందిళ్ళు వేసింది
కొత్త సందళ్ళు చేసింది.
కుదురులేని కోతిలా.....

ఆమె చుట్టే ఎగిరింది తనని
చూస్తుందన్న కొండంత ఆశతో...!
పెదవుల నడిగింది తనకు సాయం చెయ్యమని
తనలో చెలరేగే భావాలు ఆమెకు తెలియ చెయ్యమని
అమ్మో! భయంతో చిగురుటాకుల్లా వణికాయవి
కనుల నర్థించింది తన బాసల్ని వివరింపమని
సిగ్గు బరువుతో వాలిపోయాయవి స్నిగ్ధంగా.....!
అయినా ఆమె చుట్టూ తిరుగుతూనే ఉంది.
ఎగురుతూనే ఉంది పాపం! పిచ్చి మనసు

బి.వి.రమణారెడ్డి
ఎన్.సి - 28

## మన భారతీయ కుటుంబం

మన భారతీయ కుటుంబం
ఆచార సంప్రదాయాల నిలయం
విదేశీయులకిది ఆదర్శం
ప్రేమానురాగాల ఆలయం
బంధాల అనుబంధాలకిదే చక్కని గృహప్రాంగణం
ఏ పాశ్చాత్య ప్రభావపు కెరటమూ
తాకలేదు ఈ వ్యవస్థ కవచం
అందుకే దీనిని కాపాడాలి మనం అందరం
నైతిక విలువల పాలనతో సగం
అప్పుడే శోభిల్లుతుంది మన
ఈ భారతీయ కుటుంబ వ్యవస్థ అందం
శోభాయమానంగా ఆ చంద్రార్కం!

కె.కామేశ్వరి
ఎమ్.ఎస్.డబ్ల్యు-6

## లొయోల

లొయోల గూర్చి తెలుసుకోవాలని ఉంది కదూ
మిత్రమా!
అయితే లొయోల గూర్చి నీతో -
విద్యార్థులకు అందమైన హరివిల్లు లొయోల
చదువులకు చక్కని నిలయం లొయోల
విజయవాడకు వన్నె తెచ్చినదీ లొయోల
చదువుల తల్లికి నిండుకొలువు లొయోల
విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దారి లొయోల
నాడు, నేడు తరగని విలువగలది లొయోల
పండితులకు పుట్టినిల్లు లొయోల
కరుణ రస హృదయాలు గల ఫాదర్స్
నిండుకొలువు లొయోల
రంగు రాజకీయాలకు తలఒగ్గనిదీ లొయోల
అవినీతి, అక్రమాలకు తావులేనిదీ లొయోల
రాజులకు రాజు ఇగ్నేషియస్ లొయోల
చదువులకు రాజు ఈ లొయోల
ఆంధ్రాకే వన్నె తెచ్చిన ఆణిముత్యం ఈ
ఆంధ్రలొయోల కాలేజి

సి.హెచ్.గిరిధర్
ఎన్‌బి - 60

## సుందరకాండ!

అటు చూస్తే అయోధ్యలో మరణకాండ!
ఇటు చూస్తే ఆంధ్రాలో అన్నలకాండ!
అటు చూస్తే అస్సాంలో ఉల్ఫాకాండ!
ఇటు చూస్తే తమిళనాడులో LTTE కాండ!
అటు చూస్తే కాశ్మీర్‌లో JKLF కాండ!
ఇటు చూస్తే పాకిస్తాన్ కయ్యం కవ్వింపుల కాండ!
అటు చూస్తే చైనా సరిహద్దు కాండ!
ఇటు చూస్తే పంజాబ్ భవిష్యత్‌కాండ!
అన్ని కాండలను పరిష్కరించి P.V. సుందరకాండను
సృష్టిస్తారని ఆశిద్దాం!

పి.మోజస్
టి.హెచ్ - 57

# ఏ విలువలకోసం ఈ ప్రస్థానం

సూర్యోదయంతో మొదలవుతుంది మన సమాజంలోని విభిన్న తరగతుల మధ్యగల వికార స్వభావం. మానవుని తత్వం చాల విచిత్రమైనది. మంచి-చెడు, స్నేహం-శతృత్వం అనే అంశాలపై ఆధారపడి యావత్ మానవ సమాజం జీవిస్తుంది. మనిషిని, మనిషిగా గుర్తించే సమాజం నశించిపోయినది. మానవత్వం మంటగలసి దానవత్వం విలయతాండవం చేస్తుంది. ఒక వ్యక్తి సమాజానికి, తన అనుబంధ పరిస్థితులలో జీవించే ప్రజలకు ఏదైనా మంచి చేయాలని నిర్ధయించుకోవటం ఈనాటి సమాజంలో అతి పెద్ద ఘోర నేరం.

స్వచ్ఛమైన మనస్సు కలిగి, సహృదయంతో ఎదుటి వ్యక్తి బాధను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం అతి నీచమైన నేరంగా పరిగణింపబడుతుంది. అందుకే మన పూర్వికులు అంటారు - నైతిక విలువలకు తావులేని చోట మానవత్వం అనే పదానికి అర్థం ఉండదు. అని 'ఎక్కడైతే మంచి చేయాలని తలుస్తారో, అక్కడ తప్పని సరిగ్గా చెడు ఉంటుంది'. మన సమాజం అంతా కుళ్ళు, కుతంత్రాలకు నిలయమై గర్భిణి స్త్రీ వలె నడవలేక నడుస్తుంది. ఈ సమాజం మారేది ఎన్నటికి? అని నేను ప్రశ్నిస్తున్నా! నవ సమాజం అనే అసలు పేరు ఎప్పడైనా ఈ కుళ్ళిన సమాజంలో వినిపిస్తుందా! అసలు నేటి తరానికి నవ సమాజం అనే మాటకు అర్థం తెలిస్తే కదా! మారటానికి ప్రయత్నించేది.

ఎటు చూసినా ఏమున్నది అంతా అరాచకం, హింస, దోపిడి, దగా, మోసం అంతా కలసి నివురుగప్పిన నిప్పలా ఉంటుంది. వ్యక్తిని, వ్యక్తిగా గౌరవించే సమాజం ఏనాడో నశించి కాలగర్భంలో కలసిపోయింది. ఈనాటి మన పరిస్థితి అంతా అయోమయం. నైతికంగా మనిషి ఏనాడో చనిపోయాడు. అనైతికంగా మాత్రం ఇంకా దాదాపు 4000 సంవత్సరాల వరకు జీవించగలడు. ఎదుటి వ్యక్తిని విమర్శించకుండా మరోవ్యక్తి ఉండలేడు. నిజానికి ఒక వ్యక్తిలో నేరప్రవృత్తికి కారణం నేటి మన సమాజంలో జీవించే వ్యక్తులే. వ్యక్తిలో ఉన్న మంచి గుణాలను చెడుగా చిత్రీకరించి తెరపైకి ఎక్కించి ఆడిస్తూ ఉంటారు. అతనిలో ఉన్న మంచికంటె చెడుకే ఈనాటి సమాజం ప్రాధాన్యత ఇస్తుంది. ఎదుటివ్యక్తిలో మంచిని చూసి ఈర్ష్యపడి దానిని చెడుగా ఆ వ్యక్తిపై ప్రయోగించి చివరకు సమాజంలో విలువలేకుండా చేస్తారు. మానవుడు నైతికంగా ఎంతగా దిగజారతాడో అంత దిగ జారినాడు.

మొదటగా సమాజంలో ఈర్ష్య, అసూయ, ద్వేషం అనేవి స్త్రీతో మొదలవుతాయి. చివరకు చినికి, చినికి గాలివానలా మారి వ్యవస్థనే నాశనంచేస్తాయి. ఎదుటివ్యక్తి మంచి బట్టలు వేసుకున్నా, తనకన్నా అందముగా ఉన్న స్త్రీ సహించలేదు. తనకు లేనిది ఇతరులకు ఉండకూడదు అనే స్వభావం కలిగి ఉంటుంది స్త్రీ. ఉదాహరణకు మన ఇతిహాసాలు, పురాతన కథలు, నేటి పాశ్చాత్య దేశాల నాగరికత లక్షణాలు ఇంకా ఎన్నో.

పురుషునిలో ఉన్న కాంక్షలుకూడా కొన్ని పరిస్థితులలో చాల విచిత్రరూపం దాలుస్తున్నాయి. స్త్రీని, స్త్రీగా గౌరవించలేడు. పురుషుని కామవాంఛలకు ఎందరో అబలలు బలైపోతున్నారు. తల్లికి, చెల్లికి తేడాకూడా తెలియకుండా పురుషుడు ఉంటున్నాడు. నిజానికి ఇది యావత్ మానవాళి సిగ్గుతో తలదించుకోవలసిన పరిస్థితి. ప్రపంచములోనే భారతదేశానికి ఎంతో గౌరవ, మర్యాదలు ఉన్నవి. సభ్యత, సంస్కారానికి మూలం మన భారతదేశం. అలాంటి దేశంలో పుట్టిన పురుషుడు పై విధంగా ప్రవర్తించడం చాలా ఘోరాతిఘోరమైన నేరం. ఎక్కడ ఉన్నవి నైతిక విలువలు? అంతా అనైతికం తప్ప.

పి. మౌలాలీఖాన్

ఎమ్.ఏ. ప్రీవియస్

నెం. 12

## వెలుగురేఖలు

ఎక్కడి నుండో.... నిశీధిని ధిక్కరించి....,
మసి బారిన జీవితాల ముసుగుల్లోంచి
దివీ.... భువి జ్వలించేది
మరో ప్రపంచపు దారి తెలిసేలా
దూసుకు వస్తున్నాయ్
జీవన గతుల నుండి ప్రగతి కాంతుల
వెలుగురేఖలు.... విజయపథంలోకి...
ఆకాశపు చిల్లుల నుండి పుట్టుకొచ్చిన
సూదంటు చూపుల చుక్కలను చూసి
తూరుపు కొలిమిలో తయారైన.....
ఎర్రని బొగ్గు కణాన్ని చూసి.....
ఎగసే ఆవేశాన్ని ఆర్తులుగా చేసి....
విజ్ఞానపు తేజమే ఆరని మంటలుగా
అగ్నిశిఖలై వస్తున్నాయ్....
తమ హక్కులను కూడా భుక్తం
చేసుకున్న
అపర రావణ బ్రహ్మలను.....
ఎదిరించడానికి..... ఏరి పారేయటానికి
వర్గ భేదం మత్తు పట్టిన సమాజానికి
మరమ్మత్తు చేయించడానికి......
ప్రపంచానికి, వెన్నెల వెలుగుల వెల్ల
వేయిస్తూ
వస్తున్నాయి...... ఇప్పడిప్పడే
ధైర్యకాంతుల విజ్ఞాన కిరణాలు.

జె.ఝాన్సీరాణి
డి.బి - 31

## సూక్తులు

విజ్ఞానినైతే చాటున ప్రశంసించాలి
స్త్రీనైతే ఎదుటనే ప్రశంసించాలి

మనపై అధికారుల్లో మనకు నచ్చని
గుణాన్ని మనం మన క్రింది వారి
పట్ల ప్రదర్శించకూడదు.

మనం ఏ పదవిలో ఉన్నాం అన్నది కాదు ముఖ్యం
అదిలేకపోతే మనకు ఎంత ప్రాముఖ్యం ఉంటుంది
అన్నది ముఖ్యం.

మూర్ఖునికి హృదయం నోటిలోనే ఉంటుంది
అతి తెలివి కలిగిన వానికి నోరుకూడా
హృదయంలోనే ఉంటుంది.

వ్యక్తిత్వాన్ని నిలుపుకొనేవాడే
ఇతరులకు సేవ చేయగలడు

నీ తల్లిదండ్రులను గౌరవించు, ఎందుకంటే
రేపు నీ బిడ్డలు నిన్ను గౌరవించాలి గదా!

మేకపోతులను బలియిస్తారు తప్ప
పులులను బలి యివ్వరు.

కె.పుష్పరాజ్
ఎ.బి - 22

## నివేదన

ఆగిపోకు కాలమా
ఆశతీరేవరకు
జారిపోకు మేఘమా
జల్లుగా కురిసేవరకూ

జారిపోకు పుష్పమా
వసంతం వచ్చేవరకూ
అలసిపోకు ప్రియతమా
మనసుండేంత వరకు

ఎ.సుభాష్ చంద్ర మోహన్
డి.ఓ. - 22

# 'గుర్తించబడని' శాస్త్రవేత్తలు

ఒక తరగతి గదిలో పిల్లలంతా గుమికూడారు. అందరూ ఆత్రుతతో చూస్తున్నారు. వారికి గదిగోడపై ఒక చిత్రము కనబడినది. అది ఎలా ఏర్పడినదో అందులో దాగియున్న సిద్ధాంతమేమిటో వారికి తెలియదు. కాని అందరూ ఉత్సాహముతో ఆ చిత్రమును చూస్తూ, ఆ 'సైడ్ ప్రొజెక్టర్' తయారుచేసిన అబ్బాయిని మెచ్చుకొన్నారు. ఆ అబ్బాయి ఎంతో సంతోషించాడు. కాని అపుడే అక్కడికి తరగతి ఉపాధ్యాయుడు వచ్చాడు. ఆ అబ్బాయి ప్రయోగము చేయుటచూచి కసురుకొని, ఇంకోసారి ఇటువంటి 'పిచ్చిపిచ్చి పనులు' చేసి సమయము వృధా చేయకుండా శ్రద్ధగా చదువుకొమ్మని ఆదేశించాడు. ఆ అబ్బాయికి బాధ కలిగింది. ఇంటికెళ్ళి ఈ విషయమును తల్లిదండ్రులకు చెప్పినా వారుకూడా అలాగే అన్నారు. ఆ అబ్బాయికి మరింత అసంతృప్తి కలిగింది. అతని మనసులో ఉత్పన్నమైన శాస్త్ర సంబంధ ఆలోచనలపై అతనికి గట్టి నమ్మకము కలదు. కాని వాటిని ఇతరులకు వివరించుటకు నిరాకరింపబడుతున్నాడు. తన ఆలోచనలను ఇంకా అభివృద్ధిపరచాలని, నూతన పరికరాలను తయారుచేయాలని అతని ఆత్రుత. కాని ఫలితం శూన్యం. అతనికి కావలసిన వనరులైన డబ్బు, వైజ్ఞానిక గ్రంథాలు, ప్రోత్సహించేవారు అందుబాటులో లేరు. ఆ అబ్బాయికి ఆకాశములో ప్రయాణించే విమానము కనబడినా, ఇంట్లో పనిచేసే టి.వి. కనబడినా అటువంటివాటిపై తన ఆసక్తిని కనబరచుచున్నాడు. అవి ఎలా పనిచేస్తాయి అను ప్రశ్నలు అతని మనసులో మెదిలిననూ, వాటి గురించి వివరించి చెప్పేవారు లేరు. ఒకవేళ పాఠ్యాంశాలలో అటువంటి పరికరాలగురించి వచ్చిననూ అవి కొద్దిపాటి సమాచారాన్ని మాత్రమే ఇస్తున్నాయి. ఆ కొద్దిపాటి సమాచారం అతని దృష్టిలో గోరంతవంటిది. మళ్ళీ ఆ అబ్బాయికి మిగిలేది అసంతృప్తే. పై చదువులలో ఇంకా వివరంగా తెలుసుకొనేంతవరకు తన సమయమును వృధా చేయవలసి వస్తున్నది. అతడు ఆ స్థాయి వరకు తన చదువును కొనసాగించలేకపోయినచో? ఒకవేళ ఆర్థిక స్తోమత లేక పై చువులను చదువలేకపోయినచో? వారు అలా ఉండిపోవలసిందేనా? ఇలాంటి వారిని ఎవరు ఆదరిస్తారు? వారి తెలివితేటలను సమాజము ముందు ఎవరుంచుతారు? ఇలాంటి విద్యార్థులు మన భారతదేశంలో చాలామంది ఉన్నారు. కాని వారు ''గుర్తించబడక'' ఉన్నారు.

ప్రస్తుతం అమలులో ఉన్న విద్యావిధానములో తెలివిగలవారు ఎవరైనా బాగుగా ఆలోచించి చదువవలసిన విషయమును అర్థము చేసుకొని లేక ''బట్టీ'' పట్టి పాఠ్యపుస్తకములో ఉన్నది ఉన్నట్లుగా పరీక్షాపత్రముపై రూపుదిద్దగలరు. కాని వారు సంపాదించిన విజ్ఞానము పరిమితమే కదా! అది వారికి ఉద్యోగమును సంపాదించిపెడుతుంది. కాని, ఆపై ఏమీ చేయజాలదు. నేడు ఆ ఉద్యోగాలుకూడా దొరకడం లేదు. లంచము ఇచ్చి అయోగ్యులైన వ్యక్తులు ఉద్యోగాలను కొని, యోగ్యులైన వారికి చిప్పలే మిగిలేటట్లుచేసి, వారికి లభించిన ఉద్యోగాలను దుర్వినియోగపరచి భారత వైజ్ఞానిక సామాజిక రంగాలకు బద్ధశత్రువులగుచున్నారు. కాని వైజ్ఞానిక రంగములో ఆసక్తి కలవారు మాత్రమే, తాము దీర్ఘముగా ఆలోచించి కనుగొన్న విషయాలను పాఠ్యాంశాలతో పోల్చుతూ నూతన పరికరాలను తయారుచేసి ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడేలా చేస్తారు. ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యలకు జరుగు ప్రవేశ పరీక్షలలో తనకు ఇష్టములేని ఇతర పాఠ్యాంశాల గురించి అడగడం వల్ల తనకు నచ్చిన రంగములోకి ప్రవేశింపలేకపోవుచున్నాడు. అలాకాకుండా తాము ఆసక్తికనపరచి ఎన్నుకొనిన సబ్జెక్టునకు ప్రాధాన్యత ఇస్తూ తమ విద్యాభ్యాసమును పూర్తిచేసినచో అది సంపూర్ణ ఫలమును పొందునట్లు చేయును.

అమెరికా, జపాన్ వంటి దేశాలతో పోల్చిచూచిన మనదేశము, శాస్త్రపరముగానూ సాంకేతిక విద్యా పరముగానూ ఎంతో వెనుకబడియున్నది. కారణము, మనదేశములో సామాన్య విద్యార్థికి అందుబాటులోయున్న విద్యావ్యవస్థయే! మనదేశములోని విద్యార్థులకు పరిజ్ఞానము లేక కాదు, ముందుకు వచ్చుటకు వారు ప్రోత్సహింపబడుటలేదు. అందుకే భారతీయ విద్యార్థులు చాలామంది విదేశాలకు వలసపోవుచున్నారు. అమెరికావంటి రాజ్యాలు వారిని ఉపయోగించుకొని ప్రపంచము లో అ( రాజ్యాలుగా తయారయ్యాయి. ప్రస్తుతం అమెరికాలోని 50% శాస్త్రవేత్తలు ఇతర దేశీయులే!

ఒక విత్తనము మొలకెత్తి, పెరిగి మహావృక్షమై ఇతరులకు అవసరమైన నీడను, ఫలాలను ఇవ్వాలంటే ఆ విత్తనమునకు కావలసిన నీరు పోయాలి. ఎరువు వేయాలి. అలాగే సాంకేతిక విద్యలో అభివృద్ధి చెందిన విద్యార్థులకు సరియగు ప్రోత్సాహము, ఆర్థిక వనరులు కల్పిస్తేనే ఉత్తమ శాస్త్రవేత్తలుగా రూపొంది భారతదేశ వైజ్ఞానిక రంగాభివృద్ధికి తోడ్పడతారు. కాని ఎవరలా చేస్తారు?

ఈ అపరిచితులు, గుర్తించబడని శాస్త్రవేత్తలను మన భారతదేశము పోగొట్టుకోగూడదు. వారి వైజ్ఞానిక దాహమును తీర్చుటకు తగిన సౌకర్యాలు కల్పించాలి. ప్రోత్సహించాలి. అపుడే వారి కలలు పండుతాయి. మనదేశము పురోగాభివృద్ధిని సాధిస్తుంది. ఈ కనుమరుగైయున్న శాస్త్రవేత్తలు గుర్తింపు, ఆదరణ పొంది, తగిన సౌకర్యాలు కల్పించబడి వారు ప్రదర్శించే వైజ్ఞానిక విన్యాసమును తిలకించే రోజులకొరకు ఎదురుచూస్తూ ఉంటాను.

ౙ. ఆంథోని జార్జి

ఎ.ఇ.పి. 37

## ఓ హృదయంలేని ప్రియతమా! నీకిది ధర్మమా?

ప్రియతమా! ఓ నా హృదయమా!
నిప్పుకణికల్లాంటి అగ్నిపుష్పాలు తెల్లగా
మారినపుడు కాని,
పరిమళాలు వెదజల్లే మల్లెలు మౌనంగా
నిలిచినపుడు కాని,
నిండు పున్నమిరేయి కారుచీకట్లు
కమ్మినపుడుకాని,
నిరంతరం అల్లకల్లోలంగా ఉన్న సముద్రం నిశ్శబ్దంగా
ఉన్నప్పుడు కాని
కోకిలగానం మరిచిపోయి 'భౌ భౌ....' మని
అరచినపుడుకాని,
వసంతమాసంలో విరబూసే పూదోట
మోడు వారినపుడుకాని,
నందనవనం సైతం ఎడారై కళవెల
పోయినపుడు కాని,
ప్రకృతి తారుమారైనా
నా కనిపించ(లే)దు వింతగా
కాని, ఒకే ఒక్కసారి.... క్షణంలో వెయ్యోవంతు......
'మధు'వులు ఒలికించు నీ కనుకొనలలో
కనిపించిన నిర్లక్ష్యపు 'చూపుల తూటా'
చీల్చింది నా హృదయాన్ని ముక్కలుగా........
ఓ హృదయం లేని ప్రియతమా! నీకిది ధర్మమా?

జి.శివ శంకర్

ఎన్.జెడ్.ఎఫ్. 35

## తార పిలిచింది

తనవద్దకు రమ్మంది

"నిన్ను నువ్వు చూసుకోవాలంటే
నే చుట్టూ తెలుసుకోవాలంటే
స్వార్థపు సంకెళ్ళు త్రెంచుకొని
కుత్సిత భావాలు వదులుకొని
నీలి మేఘాలలో తనువుతోపాటు
మనసునూ విహరింపజేస్తూ"

తనవద్దకు రమ్మంది

"మిణుకు, మిణుకు మంటున్నానని
చులకనగా చూడబో"కంది
"గమ్యం చేరితే గాని లక్ష్యంగొప్ప
అవగతం కాదం"ది
"చెట్టు చేమల కన్నా భువియందు
మీ జీవిత విధానం (గమనం) హీనమం"ది

నా మనసు మాత్రం.....

కామ క్రోధాది బంధాలు తెంచుకోగలవా?
ఆ 'శాంతిరాజ్యం' చేరుకో గలవా?
అంటూనే..... వుంది

తార మాత్రం....

నాకోసం ప్రతి రేయి
దర్శన మిస్తూనే..... వుంది.

డి.బాల కరుణ కుమార్
డి.పి. - 38

## "విద్యార్థి"

కాలేజి కొచ్చి కలలుగనే విద్యార్థీ
కరువు రోజుల్లో నీకెందుకోయ్ ఖర్చు
నీవు ధరించే బట్టలు నీవి కావోయ్
నీకోసం చెమటోడ్చి శ్రమించే నీ తండ్రివోయి
విదేశీ వస్త్రధారణచేసి వింత వింత షోకులతో
రోమన్ [హెయిర్] కటింగ్‌తో
విలాసాలతో కులాసాగా షికార్లు తిరిగే ఓ విద్యార్థీ
వివేకంతో కులాసాలను విడిచెయ్
పురివిప్పిన నీ చీకటి జీవితం నుంచే పుడుతుంది
జ్ఞానం తేజం
అందుకే నేస్తం స్నేహార్థివై ప్రేమార్థితో
వదువనే అంతరంగాన్ని పొంగెత్తే
అనుభూతితో విద్యార్థివై సాగిపో....

సి.హెచ్.జోసెఫ్
టి.హెచ్. - 64

## జీవిత శకటం

ఉషోదయాన ఉద్భవించి
మధ్యాహ్నాన మన్నలనంది
పశ్చిమాన్ని ప్రశ్నించగా

బ్రతుకు యాతనల బాటమీద
నిరాశా చక్రాల మీద
నడుస్తుందా అనే గుబులులో
నడిపిస్తున్నాను ఈ జీవిత శకటాన్ని

పగలు రేయి ఒకటై
విశ్రాంతి అసలే కరవై
గమ్యం తెలియని పైనంలో
శ్మశాన వీధిలో ఆపాలి ఈ జీవిత శకటాన్ని

ఎమ్.వి.ఫణి కుమార్
ఎ.ఇ.హెచ్. - 10

# 'నాట్యకళ'

'నాటకాంతమ్‌హిసాహిత్యమ్' -- అనేది ఆర్యోక్తి.

నాటకం సమాహారకళ. సమస్త లలితకళలకి నాటకలో సమప్రాధాన్యం ఉంటుంది. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం మొదలగు కళలను తగిన రీతిలో పోషించినపుడే నాటకం రక్తికడుతుంది. ప్రేక్షకుల నాడికి స్పందన కలిగిస్తుంది. మనస్సును పరవశింపచేస్తుంది.

నాటకప్రయోజనం కేవలం మనసును రంజింపచేయడమే. మానసిక ఆనందాన్ని ఇవ్వడమే. విసిగిన మనసుకు కాస్త సేదతీర్చడమే. నాటకం ప్రారంభం నుండి నాటకాంతం వరకూ చూస్తున్న ప్రతి ప్రేక్షకుడి మనసు, శరీరం అలౌకికమైన ఆనందాన్ని అనుభవించగలిగితే నాటక ప్రయోజనం పూర్తిగా నెరవేరినట్లే. ప్రేక్షకులలో ౮౦% మంది నాటకంలో కేవలం ఈ ప్రయోజనాన్ని ఆశించే చూడడానికివస్తారు.

నాటకంలోని రెండవ ప్రయోజనం సందేశం. ఇది ఆనుషంగికం. నాటకాన్ని చూసిన ప్రేక్షకుడు మానసికమైన మార్పుకు గురిఅయితే అతను ఒక్కడే నాటకసందేశ రసాన్ని ఆస్వాదించినవాడు అవుతాడు. నాటక ప్రదర్శనలో నీతిని గురించి చెప్పాలంటే అవినీతి తప్పనిసరిగా చూపించితీరాలి. 'సత్యాన్నే పలకాలి' - అని చిన్న పిల్లలకు నీతిని చెప్పేటప్పుడు అసత్యపు దుష్ఫలితాన్ని కూడా వారికి వివరించాలి. 'పులి బాబోయ్ పులి'..... అనే కథలు ఈ కోవకు చెందినవే. కేవలం సందేశ ప్రయోజనంకోసమే కాచుకొని కూర్చునే ప్రేక్షకుడు తన మనోభావాలకు అనుగుణంగా నాటక ప్రయోజనాన్ని పొందుతాడు. మనసు చెడును ఆకర్షించడానికి ఉద్యమించినట్లుగా మంచికోసం ప్రయత్నించదు. అందుకే నాటకంలో సందేశమే ప్రధాన ప్రయోజనమై ఉండాలని కోరేవారు మంచికంటే చెడ్డనే ఎక్కువ ప్రేక్షకుడి ఇచ్చినవారవుతారు. ఈనాటి సినిమాలు యువతను పెడదోవ పట్టిస్తున్నాయని అనడానికి కారణమదే.

నాటకం విజయవంతం కావడానికి రచయిత, దర్శకుడు, నటీనటుల నటనాకౌశలం మొదలగున ప్రధానాంశాలుగా ఉంటాయి. ఎంపికచేసిన ఇతి వృత్తానికి అనుగుణంగా దర్శకుడు పాత్రలను తీర్చిదిద్దుతాడు. పాత్రధారులకు నటనాకౌశలములో నాలుగు విధాల అభినయాలు గురించి దర్శకుడు చక్కగా అలంకరింపచేస్తాడు. ఉత్తమ నటన ఎలాఉండాలో ఉత్తమనటుడికి ఎలాంటి లక్షణాలు ఉండాలో బోధపడేటట్లుగా వివరిస్తాడు.

నటన ఎప్పుడు 'తామరపైన నీటిబొట్టు'లాగా ఉండాలి. చూడడానికి నీటిబొట్టు తామరను తాకినట్లుగనే ఉంటుంది కానీ నిజంగా తాకదు. అలాగే నటుడుకూడా. తాను నవ్వకుండా ఇతరులను నవ్వించాలి. తను ఏడవకుండా ప్రేక్షకులను ఏడిపించాలి. శృంగార సన్నివేశాలలో తను అనుభూతి పొందకుండా చూపరులను పొందేటట్లుగా చెయ్యాలి. అప్పడే ఆ నటుడు పదికాలాలపాటు ప్రేక్షకలోకంలో సముచిత స్థానాన్ని పొందగలడు. కాని ఈ విధంగా నటించడం కత్తిమీద సాములాంటిదే. కారణం సహజప్రవృత్తి నుండి నటనా ప్రవృత్తిని వేరుచెయ్యడం. నటుడుకూడా ప్రాణమున్న మనిషే. అతనికీ సహజ ఆవేశకావేశాలుంటాయి. తన శారీరక ఉద్రేకాలన్ని నియంత్రించుకొని

అరువుతెచ్చుకొన్న ఉద్రేకాలను మాత్రమే ప్రదర్శించాలి. ఇది ఎంత కష్టమైన పని. అరువు ఉద్రేకాలకి సహజ ఉద్రేకాలు తోడు అయితే ఆ నాటకం అభాసుపాలు అవుతుంది. అందుకే నటుడు నవరసాలను శరీరంద్వారా మాత్రమే ప్రదర్శించాలి. మనసుద్వారా ప్రదర్శించకూడదు. నటుడు త్రికరణశుద్ధిగా నటించకూడదు. అంటే పాత్రలో తన్మయత్వమై, మమేకమై ఉండరాదు. నటిస్తున్నంతసేపు తను పాత్రధారుణ్ణే అనే సంగతి మరిచిపోకూడదు. అలా అని ఆయా రసాలకి అనుగుణంగా సహజగుణాలని ప్రదర్శించకుండా ఉండకూడదు. అందుకే 'నటన దైవానుగ్రహావరం' - అంటారు. సహజంగా రాని ఈ నటనను సాధనద్వారా తప్పక సాధించవచ్చు. అనుభవమే నటనకు వరవడి.

నటీనటులు అభినయం విషయంలో తీసుకొనే జాగ్రత్తలే నాటకం సంపూర్ణ విజయం సాధించడానికి తోడ్పడతాయి. ప్రతి నటుడికి చతుర్విధ అభినయాల గురించి చక్కని అవగాహన ఉండాలి. నీచపాత్రనుండి ఉత్తమ పాత్ర ధరించే నటుడివరకూ నటనాకౌశల ప్రదర్శనకు మణిమకుటాలైన నాలుగు విధాల అభినయాల సర్వస్వం తెలిసి ఉండాలి. అవి.

౧ ఆహార్యం ౩ ఆంగికం

౨ వాచికం ౪ సాత్త్వికం.

౧ **ఆహార్యం** :- ఆహార్యం అంటే పాత్రకు తగిన వేషాన్నిధరించడం. దీనినే ఇంగ్లీషులో "Costumes and make-up" అంటారు. నటుడు తను ధరించిన పాత్రకు అనుగుణంగా తగిన వస్త్రధారణ, అలంకరణ కలిగిఉండాలి. పాత్రరంగస్థలం మీదకు ప్రవేశించగనే ప్రేక్షకుడు మొదటిసారిగా గుర్తించేది నటుడి బాహ్యారూపాన్ని మాత్రమే. ఇదే ప్రేక్షకుడికి ఆనందాన్ని కలిగించేదికూడా. చక్కటి వేషధారణగల పాత్ర ప్రవేశించగనే ఆ పాత్ర ఔచిత్యాన్ని ప్రేక్షకుడు గుర్తించగలడు. పాత్ర స్వరూపాన్నిబట్టి స్వభావాన్ని తెలుసుకోవడానికి ఆహార్యం ఎంతో దోహదంచేస్తుంది. పాత్రోచిత ఆహార్యం నటుడికి నటనాకౌశలాన్ని ప్రదర్శించడానికి ఉపయోగపడుతుంది. ఉదాహరణకు భిక్షగాని వేషం ధరించకుండా భిక్షువు మాదిరి ప్రవర్తించడం సహజనటన అని అనిపించుకోదు. పాత్రోచిత ఆహార్యం ఉంటేనే సాత్త్విక అభినయం సంపూర్ణ విజయం సాధిస్తుంది.

నాటకంలో పాత్రోచిత ఆహార్యం తర్వాతనే వాచిక, ఆంగిక సాత్త్విక అభినయాలకు ప్రాధాన్యం. చక్కని ఆహార్యం పాత్ర దేశ, కాల, గుణ నిర్దేశంచేస్తుంది. పామరుల మనసుకు భ్రాంతిని కలిగించి, వారిలో రసనిష్పత్తిని కలిగింప చేసేది పాత్రల వేషధారణ. పౌరాణిక, చారిత్రక నాటకాలలో ఆహార్య ప్రాధాన్యం ఎంతేని ఉంది. పురాణపురుషులను (రాముడు, కృష్ణుడు, సీత, సావిత్రి చారిత్రక వ్యక్తులను (అశోకుడు, చంద్రగుప్త, శివాజీ అభివ్యక్తీకరించాలంటే కేవలం ఆహార్యంద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది. సాంఘిక నాటకాలలోకూడా పాత్రకు తగినవిధంగా ఆహార్యం లేకుంటే నటుడు ప్రదర్శించే ఇతర అభినయాలను ప్రేక్షకుడు ఆస్వాదించలేడు. అందుకే నాటక ప్రదర్శనలో "Green Room" ప్రాధాన్యం ప్రధానమైన భూమికను నిర్వహిస్తుంది అనడంలో అత్యుక్తిలేదు.

౨ వాచికం :- వాక్కులోనే సమస్త విశ్వం దాగిఉంటుంది. వాక్‌శక్తి అనంతమైనది. భర్తృహరి వాక్కును సంపదగా, బంధువుగా, బంధనంగా, మృత్యువుగా పేర్కొంటాడు. వాక్ భూషణానికి మించిన భూషణము మరొకటిలేదు. నటీనటులు ప్రదర్శించే వాచికాభినయంద్వారా ఆయా పాత్రల వ్యక్తిత్వాలను ప్రేక్షకులట్టే గుర్తించగలరు.

ఆహార్యం తర్వాత ప్రదర్శించే నటన వాచికం. కవివాడిన భాషాపదాలపైన నటవర్గానికి పట్టుఉండాలి. కవి తన రచనా చమత్కారంకోసం ప్రయోగించిన పదాలలోని లక్షణ, వ్యంగ్య, ధ్వని సంబంధమైన స్వరాలను ప్రేక్షకులు గ్రహించేటట్లుగా నటీనటుల నటనా ప్రదర్శనం ఉండాలి. చక్కని ముఖయంత్రం కలిగిఉండి స్థాయి, ఊనికల స్వభావాదులు నటులకు తెలిసి ఉండాలి.

తెలుగుభాషలో 'స్థాయి' "Pitch" కూడా ఒక వర్ణమే అవుతుంది. (Pitch is the phoneme in Telugu Language) ఉచ్చ, నీచ స్వరిత స్వరాలు ఆయా సందర్భాలలో అర్థభేదాన్ని కలిగి ఉండడం మనం **గమనిస్తూనే** ఉంటాము.

ఉదా 'నీతల్లి' - అనే పదాలను 'నీ తల్లి' స్వరిత స్వరంతో పలికితే 'మీ అమ్మగారు' - అనే గౌరవార్థం, 'నీ..... తల్లి' - అని ఉచ్చస్వరంతో పలికితే బూతులోని 'నీచార్థం' స్ఫురిస్తుంది. కుశీలవులు తాము పలికే ప్రతిపదం అర్థాన్ని తెలిసే పలకాలి. స్థాయిమారినా, ఊనిక మారినా పలికిన పదాలకు పెడర్థాలు వచ్చే అవకాశముంది.

వీరావేశాన్ని వ్యక్తీకరించే 'డైలాగ్స్' పలుకుతున్నప్పుడు నటుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆవేశంలో శరీరం సహజంగా గగుర్పాటు పొందడం, కంపించడం ఉంటుంది. ఇటువంటి సమయంలోనే తను చెపుతున్న మాటలలో తడబాటు, వ్యతిరేకార్థాలు, విపరీత అర్థాలు వస్తూ ఉంటాయి. ఉదా రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయులు రామునితో 'మా జాతి లక్షణంబు, మీకోతి లక్షణంబు' - అని పాడితే ప్రేక్షకలోకం నవ్వకుండా ఉండలేదు. అలాగే 'తొల్లిగతించే' అనబోయి 'తల్లిగతించే' - అని అనడం, 'ప్రీతి' అనే పదాన్ని తొందరలో 'పీతి' గా పలకడం 'ఎందు దాగినావురా రామా' అనే దానిని 'ఎంత తాగినావురా రామా' అని అనడం బ్రహ్మగయుణ్ణి 'గయుడా నీ ఆర్తి నేనెటింగెద అనబోయి' 'నీ ఆస్తి నేనెటింగెద' అనడం వలన చాలా ఇబ్బందులు వస్తాయి. అలాగే శోక, భీభత్స, భయా, అద్భుత రసాలను వ్యక్తంచేసే సందర్భంలో నటుడి ఉచ్చారణలోని కాకువు (into nation) లు ప్రేక్షకులచేత జేజేలు పలికిస్తుంది. అర్థాంతర స్ఫూర్తికి అనుగుణంగా నటీనటులు ఉచ్చారణలో భేదాలను పాటిస్తూ నటించగలిగితే ఆ నటన అజరామరం అవుతుంది.

౩ ఆంగికం :- వాచికంతోపాటు నటీనటులు ప్రదర్శించవలసిన మరొక అభినయం ఆంగికం. రసభావాదుల అభివ్యక్తీకరణకు అనుగుణంగా అంగ విక్షేపణ చేయడం ఆంగికాభినయం అంటారు. మనోభావాలను అనుసరించి అప్రత్నంగనే అంగప్రదర్శనం జరుగుతూ ఉంటుంది. కానీ రంగస్థలంమీద నటుడు ఆయా అంగ విక్షేపణం సహజంగా కాకుండా అనుకరించవలసి ఉన్నది. అంగ (తల, చేతులు, నడుము, హృదయభాగం, కాళ్ళు ఉపాంగం (కళ్ళు, కనుబొమలు, ముక్కు, పెదాలు, నొసలు, గడ్డము) ములచేత నటుడు తన నటనను ప్రదర్శించాలి.

ఆంగిక అభినయానికి ముఖం అద్దంలాంటిది. చాలా భావాలను ముఖ కవళికలను బట్టే ప్రేక్షకుడు చేసుకోగలడు. శృంగార, వీర, కరుణ, హాస్యరసభావాలను ప్రకటించేటప్పుడు ముఖాంగ విక్షేపణం స్పష్టంగా ... నృత్త, నృత్య, నాట్యాదులలో ఆంగికాభినయానికే ప్రాధాన్యం ఎక్కువ. ఆంగికాభినయం లేని నటనకి భావ ప్రకటనాసామర్థ్యం ఉంటుందేమో కానీ రసపరిగ్రహణ శక్తి ఉండదు. ఒక్కొక్కసారి వాచికాభినయం లోపిస్తే ఆంగికంద్వారా దాన్ని పూరించవచ్చు.

ఆంగిక అభినయంలో నటుడు తెలుసుకోవలసినదంతా ఆయా పదాల అర్థపుష్టిని మాత్రమే. ప్రతిపదానికి అర్థం తెలుసుకొని నోటితో పలకగలిగితే సహజంగానే అంగ విక్షేపణ జరిగిపోతూనే ఉంటుంది. ఉదాహరణకి 'అదుగో ద్వారక ఆలమందలవిగో.....' అన్నప్పుడు చూపుడు వ్రేలుతో కూడిన అంగవిన్యాసం జరుగుతుంది. నటుడు అన్యమనస్కంగా ఉండి పై పద్యం ప్రారంభిస్తే చేతులు అలాగే ఉండిపోతాయి. కాబట్టి నటీనటులు తాము పలికే ప్రతిపదంపై ఎంతో ఏకాగ్రత ఉంటేగానీ అంగికాభినయం సహజమనిపించదు.

హద్దులు మీరిన అంగ విక్షేపణంకూడా నాటకాన్ని అభాసుపాలు చేస్తుంది. వాచిక ప్రయోగానికి ముందే ఆంగిక ప్రయోగం ఉండకూడదు. ఆంగికమెప్పుడు వాచికాన్ని అనుసరిస్తూ ఉండాలి. నీ, నా, తన శబ్దాలు, ప్రశ్నార్థక రూపాల ప్రదర్శనలో అంగవిక్షేపణం తారుమారు అయితే ప్రేక్షకులు నవ్వుకొంటారు. ఇది భావాన్ని ముందు ప్రకటించి భాషను తర్వాత ప్రకటించినట్లుగా ఉంటుంది. ఆయా రస, భావ ప్రకటనలకు అనుగుణంగా స్త్రీ, పురుషులు వేరువేరుగా అంగవిక్షేపణ చెయ్యాలి. దుఃఖాన్ని అభినయించేప్పుడు పురుషుని ఆంగిక అభినయం స్త్రీ ఆంగిక అభినయం మాదిరిగా ఉండకూడదు. వాచిక గాంభీర్యంతోపాటు తగినపాళ్ళలో ఆంగిక అభినయం ఉన్న నటనే రాణిస్తుంది.

4) **సాత్త్వికం** :- నటీనటుల నటనా సామర్థ్యం సాత్త్వికాభినయంలో బయటపడుతుంది. ఇక్కడే నటుడు 'కత్తిమీదసాము' చెయ్యవలసివస్తుంది. కారణం తాను ప్రకటించే ఏభావం తనదికాక పోవడమే. నటనలో ఏ భావాలు ఎవరిసొంతంకావు. ఎవరి భావాలో నటులు అనుకరించి చూపాలి. నిజ జీవితంలో మనోభావాలకి యధార్థరూపాన్ని ఇవ్వవచ్చు. భావోద్రేకానికిలోనుకావచ్చు. కానీ నటన జీవితంలో అలా జరగడానికి వీలులేదు. అంటే నటుడు నటనలో భావోద్రేకానికి గానీ, తన్మయత్వానికి లోనుకాకూడదు. కేవలం ప్రేక్షకలోకాన్ని మాత్రమే భావోద్రేకంతో, తన్మయత్వంతో ముంచాలి. ఇది సాధ్యమా! తనూ ప్రేక్షకులవర్గానికి చెందినవాడేగా. తాను అనుభవించని ఉద్రేక, తన్మయత్వాలను ప్రేక్షకులచేత ఎలా అనుభవింప చేయగలడు.

'సత్త్వము' అంటే మనసునుండి పుట్టినది అని అర్థం. సాత్త్విక అభినయం అంటే మనఃప్రధానమైన నటన. ఆంగిక, ఆహార్య, వాచిక అభినయాలనుండి దీనిని వేరుచేసి చూడాలి. ఇతరుల సుఖదుఃఖాలను తన మనసునందు ఆరోపించుకోవాలి. పాత్ర ఏడుస్తుంది కానీ పాత్రధారుడు ఏడవడంలేదు అన్న భ్రాంతిని ప్రేక్షకలోకానికి కలిగేటట్లు చెయ్యాలి. దీనినే ఉత్తమ నటన అంటారు. సాత్త్విక అభినయ ప్రదర్శన ప్రాధాన్యమే నాటక విజయానికి ప్రథమసోపానం. సాత్త్విక నటనే మిగతా నటనలకి గీటురాయిగా ఉంటుంది. శృంగార, వీర రసప్రదర్శనలో సాత్త్విక నటనను స్పష్టంగా గుర్తించవచ్చు.

నాటక న్యాయాన్ని పరిశీలించే న్యాయనిర్ణేతలు ఉత్తమ నాటకాన్ని నిర్ణయించేటప్పుడు, ఉత్తమనటుడిని నిర్ణయించేటప్పుడు సాత్త్విక అభినయాన్నే ప్రధానంగా తీసుకొంటారు. చతుర్విధ అభినయాలలో నటుడు ఏ అభినయానికి ప్రాధాన్యం ఇచ్చాడన్న అంశాన్ని బట్టే నటనా సామర్థ్యాన్ని లెక్కించాలి. సాత్త్విక అభినయం అధికపాళ్ళలో ఉంటే ఉత్తమనటనగా, మిగతా అభినయాలతో సమానంగా ఉంటే మధ్యమనటనగా, అతి తక్కువ సాత్త్విక అభినయం ఉంటే అధమనటనగా, సాత్త్విక నటనలోపిస్తే అధమాధమ నటనగా నిర్ణయించవచ్చు.

సత్త్వగుణసంపన్నులే సాత్త్విక నటనను ప్రదర్శించగలరు. సత్త్వగుణము పురుష ప్రయత్నంతోపాటు దైవానుగ్రం ఉన్న వారికే ఉంటుంది. సాత్త్విక నటనకూడా సాధన అనే పురుష ప్రయత్నం ఆశీస్సులరూపంలో దైవానుగ్రహంతోడ్పాటు అయితే చక్కగా రాణిస్తుంది. చరిత్రకు ఎక్కిన ఉత్తమనటుల నటజీవితాలన్నీ ఈ కోవకు చెందినవే. భావి నటీనటుల నటనా సామర్థ్యానికి ఉత్తమ నటజీవితాల పరిశీలనం, నాట్య శాస్త్ర సూత్రాల అధ్యయనం, ఔపోశనమే

డా|| వీరంరెడ్డి గోపాలరెడ్డి
తెలుగుశాఖ

## విద్యార్థులు

విద్యార్థులం విద్యార్థులం
ప్రగతిశీల పౌరులం, వీరులం, ధీరులం
భావితరానికి వారసులం
విద్యార్థులం విద్యార్థులం
నవసమాజ నిర్మాతలం విప్లవరథ చక్రాలం
అహింసా వాదులం శాంతి కాముకులం
నేటి విద్యార్థులం
రేపటి నిరుద్యోగులం
విద్యార్థులం విద్యార్థులం

వై.సౌజన్య
ఎ.జెడ్. 21

## ఎదిగిపో......

విద్యలేదనా నీచింత
బాధపడకు నువ్వు అంతగా
ఉందిగా "లయోలా కళాశాల" నీచెంత
చేరిపో అడగకుండా ఫీజు ఎంత
అది విజ్ఞానపు నిండు ముంత
తోసివేయి నీ అజ్ఞానాన్ని కొంత - కొంత
నేర్చుకో - నింపుకో ప్రేమను
నీ గుండె నిండా కొండంత!
ఎదిగిపో పాలపుంత అంత!

వై.ఎన్.వి.ఎస్. కిరణ్‌కుమార్
ఎ.ఓ. 56

## కవిత

స్నేహం లేని జీవితం
వాసన లేని పూవు వంటిది.
సిరి సంపదలలో ఉన్నవాడు కాదురా మిత్రుడు
ఆపదలలో ఆదుకొన్నవాడు మిత్రుడు

ఆకలి ఏ కులము మతము ఎరుగదు
అలాగే స్నేహము బీద, గొప్ప తేడాల నెరుగదు
స్నేహమనే రెండక్షరాల బంధము
అది జీవితాంతం ఉండే ఋణానుబంధం

ఒంటరితనంలో తోడయ్యే వాడే మిత్రుడు
మనిషి అభివృద్ధికి దోహదపడే వాడే మిత్రుడు
నీళ్ళ తడి అంటకుండా సముద్రాన్ని
దాటవచ్చేమో గానీ,
స్నేహం లేకుండా జీవిత గమ్యాన్ని దాటలేము.

నోటి నాలుక నుండి వెలువడే నాలుగు మాటలు
నీ స్నేహ జీవితానికి బంగారు వెలుగుబాటలు
స్నేహితులనేవారు ఆడవారు, మగవారు
నీ నిజజీవితంలో ఉత్తమ సలహాదారులు

కె.కిరణ్ ప్రసాద్ రెడ్డి
టి.ఎమ్.వై - 78

## స్నేహం

స్నేహమన్నది జీవితం
స్నేహమన్నది శాశ్వతం
త్యాగానికి అర్థం స్నేహం
ప్రాణానికి ప్రాణం నేస్తం

నీవు, నేను ఒకటైతే నేస్తం
మనసు, మనసు కలిస్తేనే నేస్తం
కోట్లకన్నా విలువైనది స్నేహం
అనురాగపు మరోరూపం నేస్తం

అహంకారానికి లేదక్కడ స్థానం
కుల, మతాలకిది దూరం దూరం
చేయి చేయి కలసిన ఈ బలంతో
ప్రపంచాన్నైనా ఎదిరించగలం

బి. దుర్గాప్రసాద్
ఎన్.సి.పి-43

## ఐదు నిమిషాలు

భస్తుడు - భగవంతుడా నీకు ఒక కోటి సంవత్సరములు ఎంత సేపటితో సమానము.

భగవంతుడు - ఐదు నిమిషములతో సమానము.

భస్తుడు - భగవంతుడా నీకు కోటి రూపాయలు ఎంతతో సమానము.

భగవంతుడు - ఐదు పైసలతో సమానము.

భస్తుడు - అయితే భగవంతుడా నాకు ఆ ఐదుపైసలు ప్రసాదించండి.

భగవంతుడు - అందుకోసం ఐదునిమిషాలు ఆగు

భస్తుడు - ?!!!

గౌరీ శంకర్
టి.బి.-50

# మద్యపాన నిషేధం - యువతపాత్ర

**ఉపోద్ఘాతము** : మద్యపానము అనగా మద్యమును సేవించుట (లేదా) సురాపానము అనియు అందురు. ఇది సప్తవ్యసనాలలో ఒకటి. వ్యసనము అనగా చెడు అలవాటు. వీటికి బానిస అయినవారు ఇంటిని, వంటిని గుల్లచేసుకొని నలుగురిలో నవ్వుల పాలగుదురు. మన నిత్య జీవితంలో మద్యపాన మత్తులను ఎందరినో చూస్తున్నాము.

**పూర్వస్థితి** : ఈ మద్యాన్ని సేవించుట అనేది ప్రాచీనకాలము నుండి మన దేశములో ఉన్నట్లు మన పురాణాల వలన తెలియుచున్నది. శుక్రాచార్యుని కడకు మృతసంజీవిని విద్యను సంగ్రహించుటకు వచ్చినాడు బృహస్పతి కుమారుడగు కచుడు. నాడు ఆచార్యునకు సురాపానము అలవాటు ఉండుటచేత అడగకయే కచునకు మంత్రోపదేశం చేశాడు. వచ్చిన కష్టము తెలుసుకొని శుక్రాచార్యుడు సురను శపిస్తాడు. ఈ మద్యము ముట్టినవాడు జన్మజన్మలలో చేసిన పుణ్యము అంతయును కోల్పోయి పాపాత్ముడు అవుతాడని, అంతే గాకుండా సురాపాన వ్యసనము వలననే రాక్షసులు తమ ఆగడాలతో ఎన్నో యజ్ఞాలను భంగం చేశారు.

**ప్రస్తుతస్థితి** : భారత దేశ స్వాతంత్ర్య సముపార్జనకు ఉద్యమం నడిపిన మన జాతిపిత గాంధీజీగారు మద్యపాన నిషేధాన్ని చాటిచెప్పారు. ఆ తరువాత ధనం కోసము రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిషేధాన్ని పాటించటం లేదు. కానీ ౧౨౮౫ సంవత్సరములో ఏర్పడ్డ తెలుగుదేశ ప్రభుత్వం వచ్చిన అరగంటలోనే మద్యపాన నిషేదం జరుగుతుందని పార్టీ అధినేత ఎన్.టి.రామారావుగారు (ముఖ్యమంత్రి) చెప్పారు. ఆ విధంగానే రాష్ట్రప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. కానీ కొన్ని గ్రామాలలో ఈ దొంగ సారా చాటుగా తయారు అవుతుంది. దీనిని కేవలం స్త్రీ లు మాత్రమే నిషేధించగలరు. అంతేగాకుండా మన అధికారుల యొక్క పూర్తి సహకారం మనకు కావాలి. అప్పుడే ఈ మద్యపానాన్ని మనము నిషేధించగలము. ఈ మద్యాన్ని సేవించుట వలన ఎంతోమంది తమ యొక్క జీవితాలను, ఆస్తులను, భార్యాబిడ్డలను పోగొట్టుకొన్నారు.

**నష్టాలు** : మద్యపానాన్ని సేవించుట వలన వీరు తమ యొక్క విచక్షణా జ్ఞా నాన్ని కోల్పోతారు. అంతేగాకుండా వీరు తమ యొక్క ఆరోగ్యాన్ని పూర్తిగా క్షీణింప చేసుకొంటున్నారు. వీరు దొంగతనాలకు, మానభంగాలకు, దోపిడీలకు కారణభూతులౌతున్నారు. కాయ కష్టం చేసేవారు తమ యొక్క కష్టాలను మరచిపోవటానికి ఈ సురాపానాన్ని సేవిస్తున్నారు. కానీ ఆ తరువాత వీరు కష్టాలపాలౌతున్నారు. మంచి చెడ్డలు మరిచిపోతారు. గౌరవమర్యాదలు వీరు సమాజంలో కోల్పోతారు. గుండె, ఊపిరితిత్తులు, మున్నగు జబ్బులతో వీరు అనారోగ్యం పాలవుతారు. నలుగురిలో నవ్వుల పాలవుతారు. గూండాలు, నేరస్తులు అని పేరు తెచ్చు కొంటారు. మద్యం సేవించే అధికారులు డబ్బుకోసం త్రాగుడుకోసం చెయ్యరాని పనులు చేస్తారు. సాటివానికి తలనొప్పి తెస్తారు. బాధ కలిగిస్తారు.

**యువతపాత్ర** : ఈ మద్యపాన నిషేధంలో యువతపాత్ర ఎంతైనా ఉంటుంది. ముఖ్యంగా యువత ఇటువంటి త్రాగుడుకు బానిసలుగా కాకుండా వీరు త్రాగుడు వలన కలిగే నష్టాలను విస్తారంగా తమ యొక్క ప్రసంగాల ద్వారా తెలియచేయాలి. అంతేగాకుండా యువకులు ఈ మద్యపాన నిషేధానికి అధికారులకు పూర్తిగా సహకారం అందచేయాలి. వీరు త్రాగుడు ద్వారా కలిగే నష్టాలను తెలియచేయుటకు చిన్న చిన్న సభలు అప్పుడప్పుడు ఏర్పాటు చేయాలి. అంతే గాకుండా వీరు ముఖ్యంగా ఇటువంటి వాటికి బానిసలుగా తయారు గాకూడదు. అప్పుడు మాత్రము పూర్తిగా మద్యపానాన్ని నిషేధించగలము.

**ముగింపు** : నెల్లూరు జిల్లా దూబగుంటలో, స్త్రీలు ప్రారంభించిన ఈ మద్యపాన నిషేధ ఉద్యమము "ఇంతింతై వటుడింతయై" అన్నట్లు మహిళాలోకం అంతా కలిసి చేసెడి కృషికి ప్రభుత్వము వారు ఈ మద్యపాన నిషేధము చేయడం అనేది ఎంతో హర్షణీయము. ప్రజలందరూ చట్టానికి పూర్తి సహకారం ఇవ్వాలి. అంతేగాకుండా భావి భారత పౌరులు ఎవరికివారు మద్యము ముట్టం అని ప్రతిజ్ఞ చేసుకోవాలి.

సి.హెచ్.రఘురామారావు
ఎమ్.సి.-24

## ఆంధ్ర లొయోలా – ఒక మజిలీ

నా జీవన పయనంలో మరో మజిలీ.
ఒక మహావృక్షం క్రింద ఆగాను.
మూడు సంవత్సరాల వరకూ నీకు ఏ చింతా వద్దంది.
నీడకు చేరాను.
నాలానే ఎంతోమంది అక్కడ వున్నారు.
ఎంతో ఎత్తుకు చేరుకుంది ఆ వృక్షం.
ప్రజల మనస్సులలో బలంగా దిగిన వేళ్ళు
ఎంతో బలిష్ఠంగా ఉండే యంత్రాంగమనే కాండం.
నలుదిశలా వ్యాపించిన కీర్తి
ఎల్లప్పుడూ కర్తవ్యాన్నే ఆరోప్రాణంగా భావించి
బాధ్యతను భుజస్కంధాల మీద మోసే అనుభవజ్ఞులైన
అధ్యాపకులు జీవం పోస్తారు.
కొత్త చివుళ్ళు వస్తాయి కొత్త ఆశలతో
పండుటాకులు నేలరాలినా వాటి ఉనికిని ఎవరూ
మరువరు.
నాలోని విజ్ఞాన దాహాన్ని తీర్చుకునే ప్రయత్నం
చేసాను. కొండంత చేయూత.
నాకంటూ ఒక వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాను.
విద్యార్థుల చిలిపి చూపులు
అమ్మాయిల బింకాలు బిడియాలు
ఎన్నో పరిమళాలు ఎన్నో అందాలు
మూడు సంవత్సరాలు మూడు క్షణాల్లా
గడిచిపోయాయి.
వీడ్కోలు సమయం వచ్చింది.
మళ్ళీ పయనం సాగించాలి.
ఒంటరిగా కాదు
ఆ మహావృక్షం నీడలో నేను స్వంతం చేసుకున్న
పరిమళాలను నలుదిశలా వ్యాపింప చేయాలన్న
పవిత్ర భావంతో, అందరి ఆశీస్సులతో.....

ఎన్. శ్రీదేవి
డిజెడ్ - 46

## స్నేహం!

మల్లెకన్నా తెల్లనైనది
పాలకన్నా స్వచ్ఛమైనది
సుధకన్నా మధురమైనది
ఆవేదనలో ఆలంబనగా నిలిచేది!
సంతోషాన్ని పంచి ఇచ్చేది
ప్రాణాన్ని సైతం లెక్క చేయనిది
ప్రతిఫలం ఆశించనిది
వెలుగునీడలో తోడై నిలిచేది!
తనువులు వేరైనా
ప్రాణం ఒక్కటిగా ఉండేది
మనుష్యులు దూరమైనా
మధువును హృదయాలలో నిలుపుకొనేది!
తియ్యనైనది, మధురమైనది
జీవితానికి నాంది పలికేది
జీవితంలో ఆశాజ్యోతిని వెలిగించేది
ఆకాశం కంటే విశాలమైనది
హిమాలయాల కంటే ఎత్తైనది
నీలో మానవత్వాన్ని పెంచేది
నిన్ను మాధవుణ్ణి చేసేది
మృత్యువు వరకు నీకు తోడుగా ఉండేది!
అదే సృష్టిలో శాశ్వతమైనది
అదే అదే స్నేహం!!
అదే స్నేహం యొక్క అంతరార్థం!!!

ి.జయరాజు
డిఇటి - 1

## పూలు – పళ్ళు

సాహిత్యమనే మైదానాన్ని
కలం అనే హలంతో సాగుచేసి
అక్షరాలనే విత్తనాలు నాటి
ఆలోచనలనే మందులు చల్లి
పదాలనే చెట్లను పెంచి
కవితలనే పూలు పూయిద్దాం
కావ్యాలనే పళ్ళు పండిద్దాం

యస్.వి. రమణ
-యన్‌బి - 61

## నిరుద్యోగీ! ఒక్కక్షణం...!!

అరిగిన చెప్పులలో
కరిగిన కాలాన్ని చూస్తూ...
అలసిన కన్నులలో
ఆశలు నింపుకొని
ఎముకలు మిగిలిన ఒంటికి
దిక్కుల వస్త్రం తొడిగి
కాలానికి పోటీగా
పరుగిడి వస్తూన్న ఓ...
పథం. లేని నిరుద్యోగీ...
ఎచటికోయి నీ పయనం...

కాలుతున్న ప్రేవుల్లో....
అర్ధాకలి నింపుకొని
బూజుపడ్డ డిగ్రీలను
గుండెకు అదిమిపట్టి....
ఊపిరి బిగబట్టి...
బలాన్నంత కూడగట్టి
సత్వరహిత కాళ్ళలోకి
చైతన్యం తెచ్చుకొని...
నడిసంద్రం నావరీతి
దూరాలకు పయనించే...
నెలవులేని నిరుద్యోగీ...
ఎంతవరకు నీ గమనం...

ప్రపంచమంతా నిండిన
అమాయకుల ప్రతినిధీ
దొరకని భృతికోసం....
ఎందులకీ ప్రస్థానం...

ఉద్యోగం దొరికేచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు
దొరికేటి రికమండులతో
కాకుంటే నోట్లకట్లతో......

ఎవరో వస్తారని ఏదో చేస్తారని
ఎదురు చూసి మోసపోకు
కష్టేఫలి అన్న నిజం
ఇంకెన్నడు మరచిపోకు
జీవనపోరాటంలో
వెన్నుచూపి పారిపోకు
మిన్ను విరిగి మీదపడినా
వెనుకడుగులు వేయబోకు
అపజయాలు ఎదురయినా
నిరాశతో క్రుంగిపోకు

నడుంకట్టి భుజంపట్టి
కదంతొక్కి పదం పాడి
ముమ్ముందుకు సాగిపోయి
కర్తవ్యం నెరవేర్చు......

జి. ధర్మారావు
తృతీయ బి.యస్.సి.

## అనుకోలేదు

మొదటి చూపుతోనే నీ
ప్రేమలో పడ్డప్పుడు
నేనసుకోలేదు
అది నేను వేయబోయే పొరపాటని
నీ చిరునవ్వు కోసం నేను
పరితపిస్తున్నప్పుడు
నేను తెలుసుకోలేదు
అది నా మానసిక పతనానికి నాంది అని
కాని,

యిప్పుడు నీ ప్రేమ పొందలేక
పోయినప్పుడు
నాకనిపిస్తుంది
నీ ప్రేమకోసం నే వెచ్చించిన
ప్రతిక్షణం
నా బంగారు భవిష్యత్తు
శిధిలానికి కారణమని
ఇదే నా బాధ

బి. శిరెడ్డి
ఆర్.హెచ్ - 23

# ప్రసార సాధనాలు

ఈ రోజు Cable T.V. అంటే తెలియని వాళ్ళు ఉంటారనుకుంటే పొరపాటే. దాదాపు అన్నిచోట్ల CableT.V. నో లేకపోతే Star T.V. అని Popular అయిన Satellite T.V. నో ఉండి ప్రజలకు 24 గం.లు వినోదాన్ని అందిస్తున్నాయి. కాని మనలో చాలా మందికి CableT.V., Satellite T.V. (ఉపగ్రహ టెలివిజన్) ప్రసారాలు ఎలా జరుగుతాయో తెలిసి ఉండకపోవచ్చు. కాబట్టి ఇప్పుడు మనం ఇవి ఎట్లా పనిచేస్తాయో తెలుసుకుందాం.

మనం ప్రయోగించిన Artificial Satellites (కృత్రిమ ఉపగ్రహాలు) వాతావరణం అనేది లేని చోట భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాయి కదా. వీటిలో కొన్ని ప్రస్తుతం మనం తెలుసుకోబోయే Satellite Television ప్రసారాలను అందిస్తాయి. భూమిపై ఉండే Ground Station ల నుండి స్టూడియోలలో రికార్డు చేసిన ప్రోగ్రామ్స్ లేక Live telecast Frequency మార్చి వాటిని High Frequency ఉన్న తరంగాలుగా మార్చి Satellite లకు పంపుతారు. ఈ High Frequency waves ను Electro Magnetic waves (EMWS) అని అంటారు. ఈ Satellites EMWS ను గ్రహించి కొన్ని పరికరాల సహాయంతో తిరిగి భూమిపైకి ప్రసారం చేస్తాయి. ఇలా ఉపగ్రహాల నుండి వచ్చే EMWS మామూలు Geometrical Transmitters నుండి వచ్చే EMWS కన్నా ఎక్కువ ప్రాంతాన్ని Cover చేస్తాయి. ఉదాహరణకు Vijayawada లో T.V. Transmitter ఉన్న ప్రసారాలు (కేవలం) 70 k.m. వరకే పరిమితం. కాని కేవలం 3 satellites నుండి వచ్చే EMWS మొత్తం భూమినంతటినీ cover చేయగలవు.

Satellite నుండి వచ్చే EMWS ను receive చేసుకొనటానికి తెరచి ఉంచిన గొడుగు ఆకారంలో ఉండే పెద్ద అల్యూమినియం లేదా ఇనుప జల్లెడ వంటిది కావాలి. దీనిని Dish అంటారు. Dish, Satellite నుండి వచ్చే EMWS ను అన్నింటినీ reflect చేసి ఒక point దగ్గర focus చేస్తుంది. ఈ Point దగ్గర LNB అనే పరికరం అమర్చుతారు. ఈ మొత్తం అమరికను Dish Antenna అని అంటారు. LNB, Focus అయ్యే అన్ని EMWSను collect చేస్తుంది.

LNB collect చేసే waves, ముందు మనం తెలుసుకున్నట్లు, High Frequency కలవి కాబట్టి వాటిని Direct గా మన T.V. కు ఇస్తే ప్రయోజనం ఉండదు. ఈ High Frequency waves ను T.V. Frequency Range లోనికి మార్చటానికి receiver అనే పరికరం వాడుతారు. LNB ను రిసీవర్‌తో ఒక వైరు సహాయంతో కలుపుతారు. Receiver నుండి వచ్చే waves T.V Frequency Range లో ఉంటాయి కాబట్టి మన T.V. లో Programme ను చూడవచ్చును. ఒక రిసీవర్‌తో మనం ఒకసారి ఒక channel మాత్రమే చూడగలం. ఉదాహరణకు star T.V. satellite నుండి వచ్చే star Plus, BBC world, Prime sports, Zee TV, ELTV వీటన్నింటినీ ఒకే సారి చూడాలంటే మనకు 5 receivers కావాలి. ఇలా ఎన్ని channels కావాల్సివస్తే అన్ని receiver కావాలి. ఇదే విధంగా వేరు వేరు satellites నుండి వచ్చే channels చూచేందుకు వేరువేరు Dish Antennaలు కావాలి. ఉదాహరణకు Gemini TV, ETV ఒకేసారి చూడాలంటే రెండు Dish Antena లు కావాలి.

ఇట్లా అనేక receivers నుండి అనేక wires వస్తాయి. వీటన్నింటి నుండి వచ్చే waves ను channel Mixer అనే పరికరం ఒకే wave లో pack చేసి ఒక wire లోనికి పంపుతుంది. ఈ విధంగా pack అయిన wave కు ఎక్కువ దూరం ప్రయాణించేందుకు శక్తి ఉండదు. అందువలన Amplifier అనే పరికరాన్ని వాడి దానికి అత్యధిక శక్తిని ఇస్తుంది. ఈ శక్తితో packed wave ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది.

Amplifier నుండి వచ్చే wire కు మన ఇంటిలోని T.V. కు ఒక wire తో connection ఇస్తారు. అప్పుడు మన T.V. లో వారు ప్రసారం చేసే channels వస్తాయి. ఈ ప్రసారాలు వచ్చే wire ను cable అని అంటారు. అందుకే దీన్ని cable T.V. అని పిలవటం పరిపాటి. Cable ద్వారా Satellite నుండి VCP, VCRల నుండి వచ్చే చిత్రాలను కూడా ప్రసారం చేయవచ్చు. ఇలా చేయటానికి VCP లేక VCR నుండి వచ్చే wire ను channel Mixer లో ఉండే ఒక ప్రత్యేకమైన plug కు కనెక్ట్ చేస్తే సరిపోతుంది. ఇట్లా VCP లేదా VCR ల సహాయంతో మనం, మనకు కావలసిన చిత్రాలు పొందవచ్చు.

ఈ పద్ధతిలో ఈనాడు మనం చూచే Cable మరియు Satellite T.V. ప్రసారాలు జరుగుతాయి.

బి.ఎస్.ఆర్. మోహన్‌రావు
ఎన్.సి.పి. - 08

## ఓ ప్రేయసీ

ఓ ప్రేయసీ

విరహమనే విరజాజులు కురిపిస్తావా
వయస్సనే వసంతాలు పూయిస్తావా
వలపు అనే మధువును అందిస్తావా
సొగసు అనే సంపెంగలు విరజల్లుతావా

ఓ ప్రేయసీ

నీ కనులు నా కవితా వలయాలు
నీ హృదయం నా కవితకు నిలయం
నీ మనస్సు నా కవితా సొగస్సు
నీ వయస్సు నా కవితా ఉషస్సు

నీ సౌందర్యం సుందర వదనాల చందం
నీ నడకల హొయలు మరుమల్లెల పొదలు
నీ చిరునవ్వులు తొలకరి జల్లులు
నీ చూపులు నిర్మాలాకాశపు నీలి మేఘాల స్వచ్ఛం

ఓ ప్రియతమా

నీ ముగ్ధ మనోహర రూప వర్ణనకు చాలదు ఈ జన్మ
నీ లావణ్యం అజంతా శిల్పాల తీరు
నీ గువ్వల సవ్వడులు నయాగరా జలపాత హోరులు

అందుకే ఓ ప్రియతమా
మరుజన్ముంటే నేనవుతా నీ కాలిగువ్వ

సి. హెచ్. సుధాకర్
ఆర్.ఎమ్.వై. - 6

## "నా జీవితం వ్యర్థం"

దారి తెలియని అంధకారలోకములో
చేరుకోవలెను చాలా దూరము
ఈ పోటీ ప్రపంచమునందు నేను
నిస్సహాయుణ్ణి.
కన్నవారి బాష్పధారలు
వారి నోట విషాద గీతాలు
వారి కన్నులకు రక్తరేఖలు కల్గించాను.
కుల, మత భేదాలమూట మోసుకొంటూ
జీవితాలను చీల్చుకొంటూ
వెలుగుగాంచలేని వ్యర్థజీవిని.
అయ్యచేసిన ఋణంకోసం వెట్టిచాకిరి
చేసినందునవారు
నా నెత్తురంతా తోడేసి, నా ఎముకలను
మిగిల్చినారు.
చివరి ఊపిరి పీల్చుకొంటూ జీవితాశలు
వదులుకొన్న
పీడితుణ్ణి.
నాకండలే ఎరువుగా, నాగుండె నాగలిగచేసి
పరులకు నా ప్రాణాలు తాకట్టుపెట్టి
వారి సిరులు పెరిగి వారు మెరుగుపడగా
నాకు ఆస్తిలేక, యింటపస్తులే మిగిల్చిన
శోకార్తి హృదయాన్ని నేను.
నాయింటి పైకప్పు సూర్యకిరణాలు
నా కంబళి శీతాకాలపు సమీరాలు
నా బట్టలు మట్టిపార మీదు భాగాలు
ఏది అన్నమో ఏది మట్టియో తెలుసుకోలేని
నిరాశ్రయ, అభాగ్యజీవితం గడుపుతున్న
వ్యర్థజీవిని......

బి.రాయికన్న
డి.ఇ.టి - 13

# జోకాభి రామాయణం

తులసి : "రాజా! మన ప్రేమకన్నా రుచైన పదార్థమసలేదైనా వుందా ఈ లోకంలో" అంటోంది పరవశంగా.

"ఆకలేస్తోంది. త్వరగా తినడానికి ఏమైనా పెట్టు" అన్నాడు రాజా.

* * *

"ఇదిగో బుడుగూ! నా గురించి మీ అక్క ఏమంటుందో చెపుతావా, నీకు పావలా ఇస్తాను?"

"ఓ .... ఇంకో అర్థరూపాయి ఇస్తే మా అన్నయ్య నీ గురించి ఏం ప్లాను వేస్తున్నాడోకూడా చెపుతాను!"

* * *

వేషాలకోసం రోజూ విసిగిస్తున్న కుర్రాడితో చెప్పాడు దర్శకుడు "సరే మీ అడ్రస్ ఇవ్వండి, ముసలి వేషాలకు పిలుస్తాం!"

"అదేంటి సార్! నేను సూట్ అవుతానా?"

"దర్జాగా అవుతావయ్యా! మేం పిలిచే నాటికి ఆ మాత్రం ముసలితనం రాదా?"

* * *

జడ్జి : ఇంత డబ్బు ఎక్కడిది. కొల్లగొట్టినదా?

దొంగ : తప్పుసార్, అది నా కష్టార్జితం, నేను స్వయంగా నా ఇంట్లో అచ్చువేసుకున్నది.

* * *

అసలు మొహమే కనిపించనంతగా జుట్టు కమ్మేసిన ప్రొఫెసర్‌గారు బార్బర్ షాపుకు వెళ్ళి "క్రితంసారి నేను ఇక్కడేనా చేయించుకుంది" అని అడిగాడు.

"అబ్బే! మా షాపు పెట్టి రెండు సంవత్సరాలే అయింది సార్" అన్నారు అక్కడివారు.

* * *

అనురాధ, కౌసల్య జనతా షాపింగ్ సెంటర్ కెళ్ళారు. అక్కడ వున్న ఇద్దరు మగాళ్ళని చూసి అనురాధ మొహం కన్పించకుండా పక్కకు తిరిగింది. కౌసల్యకూడా అలానే చేసింది.

ఆ మగాళ్ళిద్దరూ వెళ్ళిపోయేక - "వాళ్ళలో ఒకరు నా భర్త, ఇంకొకరు నా ప్రియుడు. అందుకే నేను పక్కకు తిరిగాను" అనురాధ కౌసల్యతో చెప్పింది. "నాదీ నీలాంటి పరిస్థితే మరి!" అంటూ విసవిసా వెళ్ళింది కౌసల్య.

* * *

చిన్న పిల్లలిద్దరు మాట్లాడుకుంటున్నారు. "మా నాన్నకి బోలెడు సిగ్గురా!"

"ఎందుకు?"

"ఫుల్ షర్టు, ప్యాంటూ వేసుకోందే బయటికెళ్ళరు!"

* * *

ప్రేమికుడు పోస్ట్‌మన్‌ను ప్రాధేయపడ్డాడు "సార్! ఏదైనా లెటర్ ఒకటి వుంటే ఇవ్వండి సార్ - కాపీ చేసుకుని ఇచ్చేస్తాను"

"అదేమిటయ్యా నీవు చదువుకోలేదూ?"

"చదువుకున్నాను సార్! నాకు కాపీ కొట్టడం బాగా అలవాటు"

* * *

ఓ సంగీత కచేరి జరుగుతోంది. గాయకుడు పాటపాడటం ముగించగానే 'వన్స్‌మోర్' అన్నారు. ఉబ్బిపోయిన గాయకుడు మళ్ళీ పాడాడు. ఈ విధంగా కొందరు 'వన్స్‌మోర్' అనటం, గాయకుడు పాడటం చాలాసార్లు జరిగింది.

గాయకుడు : దయచేసి మళ్ళీ 'వన్స్‌మోర్' అనవద్దు, ఇక పాడలేను.

జనంలో కొందరు : మీరు బాగా పాడేంత వరకు 'వవన్స్‌మోర్' అనాలనుకున్నాం. కాని మేమే మా ప్రయత్నంలో ఓడిపోయాము.

* * *

భార్య : తల్లో పెట్టుకోడానికి పూలు తెమ్మంటే ప్లాస్టిక్ పూలు తెచ్చారేమిటండి?

భర్త : నువ్వు జడవేసుకునేలోగా నిజం పూలు అయితే వాడిపోతాయని!

* * *

హోటల్ యజమాని : కాఫీ తాగి డబ్బులివ్వకుండా వక్కపొడి పొట్లాలిస్తావేమిటయ్యా?

కష్టమర్ : ఇవన్నీ చిల్లర లేదని మీరు నాకు ఇచ్చిన పొట్లాలేనండీ, అవసరమొస్తుందని వుంచాను.

సేకరణ :

టి.కె.దుర్గాప్రసాద్

డి.ఓ. - 10

## కనుక్కోండి చూద్దాం

ఒకటి, మూడు - చీకటికి వ్యతిరేకంగా ప్రకాశించేది
రెండు, మూడు - ప్రతి వస్తువు తయారీకి ఉపయోగించేది
ఒకటి, రెండు, మూడు కలిసిన
ఇది మనిషికి కలిగే వ్యాధి
రెండు, నాలుగు, ఐదు - కలిసిన
దేవుని పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేది
నాలుగు, ఐదు, ఆరు, ఏడు - తామర పువ్వులుండే
కొలనులో కనిపించేది
మూడు, రెండు - ప్రతి మనిషి జీవించడానికి అవసరం
నాలుగు, మూడు, రెండు
సముద్రంపై నిత్యము కనిపించేది
ఆరు, ఏడు - ప్రతి దంపతులు కోరుకునేది
ఏడు, ఐదు, నాలుగు - మనిషికి ఉల్లాసం కలిగించునది
కనుక్కోండి చూద్దాం

**(తామర తంపర)**

అది ఒక పూవు అందము
ఆనందము నిచ్చే పూవు
దీనిపేరు ఏడక్షరాలు
ఎంతో ముచ్చట కలిగించు
ఏడూ ఆరు కలిసిన ఒక మహారాజు తల్లి
రెండు, ఆరూ, ఏడూ కలిపితే ధాతువుగా నొప్పి
మూడు, ఆరూ, ఏడు రుచులలోనిది ఒకటి
ఒకటి, ఆరూ, ఏడూ శరీర మందొక భాగం
ఒకటి, రెండూ, ఏడు ఎన్నటికి మనం చూడనిది
ఒకటి, నాలుగు, ఐదు, ఏడూ కలిపితే నిలయాధారం
అన్నీ కలిపితే ఆహాహా
నంద నందనునకు ప్రీతి
కనుక్కోండి చూద్దాం

**(కనకాంబరము)**

పి.చంటిబాబు
డి.ఇ.టి. - 15

## జోక్స్

స్టూడెంటు : మిరకిల్ అంటే ఏంటి సార్?

టీచర్ : అద్భుతం, ఆశ్చర్యం, అనుకోకుండా జరగడం, ఇలా....

స్టూడెంటు : నాకు అర్థం కావటం లేదు సార్!

టీచర్ : టీచర్‌కు కోపం వచ్చి ఫట్ అని ఒక రెంపకాయ కొట్టి "ఇప్పుడు నొప్పెడుతుందా?" అని అడిగాడు.

స్టూడెంటు : అవున్సార్!

టీచర్ : నొప్పెట్టకుండా వుంటే అదే "మిరకిల్" అన్నమాట.

* * *

సుబ్బారావుకు తాను చాల తెలివైన వాడిననే నమ్మకం ఎక్కువ. పదో అంతస్థులో వుండే సుబ్బారావు ఆఫీసుకు టైమౌతుని కంగారు కంగారుగా మేడమెట్లు దిగి వచ్చాక - కళ్ళజోడు మరిచిపోయిన సంగతి గుర్తుకు వచ్చి, పైనుంచి చూస్తున్న భార్యతో, "నా కళ్ళజోడు క్రిందప డేయి - మరచిపోయాను" అన్నాడు. ఆవిడ దానిని తెచ్చి పైనుండి పడేసింది. కళ్ళజోడు అద్దాలు పగిలిపోయాయి "అయ్యో! వాచీకూడా మరిచిపోయానే!" అని "సరే! నా వాచీ! ఇలా క్రింద తగలేయ్" అన్నాడు. విధేయురాలైన భార్య అలాగే చేసింది. వాచీ ముక్కలైపోయింది. అప్పుడు గుర్తొచ్చింది - "కర్చీపు మరిచిపోయిన సంగతి" - ఆమాటే ఆవిడతో చెప్పి, "ఛీ ఈ మూర్ఖురాలు దీనినికూడా విరగగొడుతుం దేమో!"అనుకొని "ఉండుండు! నేనే వచ్చి కర్చీ తీసుకుంటాను" అని మెట్లు ఎక్కాడు.

ఎస్.నారాయణ అయ్యర్
టి.ఏ. - 83

# "బంధు వర్గము"

| | | |
|---|---|---|
| సత్యము | -- | 'తల్లి' |
| జ్ఞానము | -- | 'తండ్రి' |
| ధర్మము | -- | 'సోదరుడు' |
| దయ | -- | 'మిత్రుడు' |
| శాంతి | -- | 'భార్య' |
| సహనము | -- | 'కుమారుడు' |

* * *

"మనం చనిపోయినప్పుడు ధనం వెంటరాదు, చుట్టాలు, స్నేహితులు శ్మశానం వరకే వస్తారు: చేసిన పుణ్యం, పాపం మాత్రమే మన వెంట వస్తాయి."

* * *

"ఆలోచన అన్నది అతి కష్టమైన పని, అందుకే చాలా తక్కువమంది ఆ పని చేస్తుంటారు."

* * *

"మనకు ఒక విషయం క్షుణ్ణంగా తెలిసినప్పుడే దాన్ని ఇతరులకు బోధించాలి."

* * *

"మిమ్మల్ని తెలుసుకునేందుకు మీ మెదడును ఉపయోగించండి, ఇతరులను తెలుసుకునేందుకు మీ హృదయాన్ని ఉపయోగించండి."

* * *

"నిరంతరం తాగుతుండే వాడికి రుచి తెలియదు. అలాగే ఎల్లప్పుడూ మాట్లాడుతుండే వాడికి ఆలోచన వుండదు."

* * *

"ఒక మతం కోసం జీవించడం కన్నా దానికోసం ప్రాణత్యాగం చేయడం ఉత్తమం."

* * *

"మనలో వుండే సహజ శక్తులే మన అనారోగ్యానికి నిజమైన ఔషధాలు"

వజ్రాల హరినారాయణ
డి.ఓ.- 33

# మధుర స్మృతులు

గుర్తుచేసుకో ఓ ప్రియ నేస్తమా
మన "లయోల" కాంపౌండులో
చలాకీగా సాగిన సరదాలు
కొంటె కుర్రాళ్ళపై చేసిన ఏలిపి కామెంట్స్
జూనియర్లపై చేసిన టీజింగ్
కూనిరాగాలతో తీసుకున్న కోచింగ్
కేంటీన్‌లో చెప్పుకున్న సోది కబుర్లు
లైబ్రరీలో విసురుకున్న హాస్యపు జల్లులు
బీచ్‌లో కొట్టిన కేరింతలు
పార్కులో పాడుకున్న పిచ్చి పాటలు
ఆ విహారయాత్రలు, వనభోజనాలు
మధురమైన సంధ్యవేళలు
నిద్రలేమితో గడిపిన నిశిరాత్రులు
ఆ మధుర స్మృతులు నిత్యసత్యాలు
అదొక గడిచిన వైభోగం
తిరిగిరాని విద్యార్థి జీవితం
తలుచుకుంటే కళ్ళల్లో నీళ్ళు
తెలియదు మరి అదే ఆనంద బాష్పాలేమో!

కానీ ఓ నేస్తమా,
రేపు నువ్వడిగిడే సంఘంలో
నేర్చుకోవలసిన జీవిత పాఠాలు ఎన్నో
అప్పుడు నీవొక చైతన్యమూర్తివి
మమతాను బంధాలను పెంచే
ఓ అమృతమూర్తివి
మిగలాలి నీవొక ఆదర్శమూర్తిగా
జీవితంలో ఎదురైన పరీక్షలే
అనుభవమనే పాఠాలుగా గుర్తుంచుకో
మరువకు మరువకు ఈ సత్యాన్ని
సరిదిద్దు ఎదుటివారి లోపాల్ని
సాహసమే ఊపిరిగా సాగిపో
మంచి వారిలో ఒకరిగా మిగిలిపో

ఎ. శ్రీదేవి
ఎమ్.ఏ.టి. - 2

# "లోకోక్తి"

-- మంచివాడి స్నేహం మంచి గుణాన్ని ఇస్తుంది.
చెడ్డవాడి సహవాసం చెడు గుణాన్ని తెస్తుంది.

-- వాన నీళ్ళు రేగటి నేలలో పడితే మంచి నీళ్ళవుతాయి.
అదే చవిటి నేలలో పడితే అవి ఉప్పునీళ్ళ అవుతాయి

# తొలిచూపు

ప్రియా!
నిన్ను తొలిసారిగా చూచినరోజు
అదే కాలేజి ప్రారంభించినరోజు,
నా హృదయాన్ని పులకింపచేసినట్లుగా
అంత మంది అందమయిన అమ్మాయిలలో
